


సింహగిరిపై ఏకాదశి తిరువీధి

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం మదనగోపాల స్వామికి తిరువీధి నిర్వహించారు.



స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక

జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక వచ్చే నెల 6న జరగనుంది. జీవీఎంసీ కమిషనర్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 10లో



ఏయూలో కొత్త కోర్సు 10లో

ఏయూలో బీటెక్ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రవేశపెట్టేందుకు సోమవారంనాటి సమావేశంలో సెనేట్ ఆమోదం తెలిపింది.

న్యూస్‌రీల్

25న పెద్దేరు జలాశయం సాగునీరు విడుదల

మాడుగుల: పెద్దేరు జలాశయం నుంచి ఈ నెల 25వ తేదీన సాగునీరు విడుదల చేయనున్నామని జలాశయం నీటి సంఘం చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు తెలిపారు. జలాశయంలో సాగునీరు పుష్కలంగా ఉండడం వల్ల జలాశయం ఆయకట్టు భూములకు ఢోకా లేదని, రానున్న నవంబరు వరకు నీటి సరఫరా కొనసాగుతుందన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



జోనల్ కమిషనర్ చక్రవర్తికి సమ్మె నోటీసు అందిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అనకాపల్లి: వచ్చే నెల 2 నుంచి మున్సిపల్ సిబ్బంది సమ్మె చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్షణ్ చెప్పారు. జోనల్ కమిషనర్ చక్రవర్తికి సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు, ఆఫీసు సిబ్బందికి, పార్కు కూలీలకు వేతనాలు పెంచాలని, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, డీఏలు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సొమ్ము విడుదల చేయాలని, రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 1వ తేదీ లోగా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించని పక్షంలో 2వ తేదీ నుంచి సమ్మె చేపడతామన్నారు. జోనల్ ఎంప్లాయిస్, క్లాప్ మిత్ర యూనియన్ నాయకులు పి.సతీష్ కుమార్, సింగపల్లి అజయ్‌కుమార్, ఎర్రంశెట్టి అప్పలరాజు, బంగారి శంకర్, రాజశేఖర్, సతీష్, శ్రీనివాస్ సిద్దా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా మళ్లీ ద్వారపురెడ్డి

అనకాపల్లి: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షునిగా మళ్లీ ద్వారపురెడ్డి పరమేశ్వరరావును నియమించారు. పార్టీ అధిష్టానం ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేసింది. ప్రధాన కార్యదర్శులుగా బొడ్డేడ నాగేశ్వరరావు, బొల్లవరపు రత్నభారత్, గొర్లి రామునాయుడు, ఉపాధ్యక్షులుగా పట్టాభి ప్రసాద్, కె.రమణమూర్తి, రాజాన దేవి, డి.ఈశ్వరప్రసాద రాజాన సన్యాసినాయుడు, బొగ్గారపు సౌందర్య నియమితులయ్యారు.

కలగానే.. ఈఎస్ఐ ఆస్పత్రి 10లో

విన్నపాలు వినవలె.. వింత వింతలు

ఔను.. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు అందిన కొన్ని విన్నపాలు వింతగానే ఉన్నాయి. సాధారణ బదిలీల్లో భాగంగా నాతవరం మండలంలో నియమించిన ఒక ఉద్యోగిని ఎండీపీవో చేర్చుకోలేదు. ఎందుకంటే.. స్పీకర్ వద్దన్నారట. ఆమె విశాఖపట్నం, అనకాపల్లి కలెక్టరేట్లలో తన గోడు వెళ్లబోసుకున్నారు. తల్లికి వందనం డబ్బులు రాలేదని నర్సీపట్నం ఆర్డీవో ఆఫీసులో ఇద్దరు తల్లులు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు స్కూల్లో ఫ్రీ సీటు పొందినందున పథకం వర్తించలేదని చెబుతున్నారని, తమ పిల్లల ఫ్రీ సీటు కోసం అసలు దరఖాస్తే చేయలేదని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు కరుణ చూపాలని విన్నవించుకుంటున్నారు.

-సాక్షి, విశాఖపట్నం/తుమ్మపాల/నర్సీపట్నం

స్పీకర్ వద్దన్నారని జాయినింగ్ నిలిపేశారు...

ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పాయకరావుపేట-2 సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ) రెడ్డి సాధనను నాతవరం మండలం ఎం.బి.పట్నం సచివాలయంలో నియమించారు. ఆమె ర్యాంక్ ఆధారంగా ఈనెల 16న ఎం.బి.పట్నం సచివాలయం వీఏఏగా బదిలీ చేస్తూ విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు (ప్రొసీడింగ్స్ నెం .998/2025) ఇచ్చారు. ఆమె 17న నాతవరం ఎంపీడీవోను కలవగా స్పీకర్ అయ్యన్నపాత్రుడి నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని, జాయినింగ్‌ను హోల్డ్‌లో పెట్టామన్నారని, స్పీకర్ వద్దకు వెళ్లి వేడుకోవాలని సూచించారు. సాధన ఐదు రోజులు ఎదురుచూసి సోమవారం పీజీఆర్ఎస్‌లో తన సమస్య విన్నవించుకున్నారు. విశాఖ కలెక్టర్‌ను కలిసి తన జాయినింగ్ ఆర్డర్‌ను ఎంపీడీవో తీసుకోలేదని తెలిపారు. విధుల్లో ఎటువంటి తప్పులు లేకుండా తన పోస్టింగ్‌ను ఎలా ఆపుతారని, తక్షణమే విచారణ చేసి తనను జాయిన్ చేసుకోవాలని కోరారు. దీంతో విశాఖ అగ్రికల్చర్ జేడీ అప్పలరాజును పిలిచి తక్షణమే పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఎంపీడీవోతో మాట్లాడతామని జేడీ చెప్పారు. అదేవిధంగా ఆమె అనకాపల్లి కలెక్టర్‌కు కూడా తన సమస్యను విన్నవించుకున్నారు. అనంతరం రెడ్డి సాధన భర్త చింతకాయల చినబాబు మాట్లాడుతూ.. తాను కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఉన్నాననే కక్షతో తన భార్యను జాయిన్ చేసుకోకుండా స్పీకర్ అయ్యన్నపాత్రుడు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బదిలీ ప్రక్రియలో భాగంగా అలాట్ చేసిన చోట పోస్టింగ్ కల్పించకుండా వేధిస్తున్న అధికారులు, స్పీకర్‌పై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు.



విశాఖ కలెక్టరేట్‌లో ఇచ్చిన ఫిర్యాదు కాపీతో వీఏఏ సాధన, ఆమె భర్త చింతకాయల చినబాబు



సర్వే ఎవరి కోసం.. ఎందుకోసం?

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న నారాయుడుపాలెం గ్రామస్తులు

ఎటువంటి సమాచారం లేకుండా చేపడుతున్న భూముల సర్వేను తక్షణమే నిలిపివేసి గ్రామాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ మునగపాక మండలం నారాయుడుపాలెం సర్పంచ్ కె.వెంకటితోపాటు గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తమ గ్రామంలో కొన్ని రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను అధికారులు సర్వే చేస్తున్నారని, ఎందుకు సర్వే జరుగుతుందో గ్రామస్తులకు చెప్పకుండా సమాచారం గోప్యంగా ఉంచడంతో తీవ్ర ఆందోళనగా ఉందని గ్రామస్తులు వాపోయారు. గ్రామాన్ని, భూములను వదిలేదిలేదని, తమ గ్రామంలో జరుగుతున్న సర్వే నిలిపివేసి గ్రామాన్ని కాపాడాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

తల్లికి వందనం' అందలేదు..



ఆమె పేరు వేమవరపు పార్వతి. నర్సీపట్నం మున్సిపాలిటీలో నివసిస్తున్నారు. ఆమె కుమార్తె అమృత వర్షిణి, కుమారుడు తేజీలను శివపురం గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. వారికి 'తల్లికి వందనం' డబ్బులు రాలేదు. ఆన్‌లైన్లో స్టేటస్ చెక్ చేయిస్తే విద్యా హక్కు చట్టం కింద వారు ప్రైవేటు స్కూల్‌లో ఫ్రీ సీట్ పొందినట్టు చూపిస్తున్నారట. వాస్తవంగా తన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి వెళ్లి చెప్పినా ప్రయోజనం లేదని ఆమె చెప్పారు. ఆర్డీవో ద్వారా న్యాయం జరుగుతుందనే ఆశతో.. తల్లికి వందనం పథకం ఇప్పించాలని ఆమె నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి వచ్చి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

పెండింగ్‌లో పెట్టారట..



ఆమె పేరు కుంత్సం అపర్ణ, నర్సీపట్నం అయ్యన్న కాలనీలో నివసిస్తున్నారు. పిల్లలు సోహన్ సంపత్, సోహిల్ శ్రేయాస్‌లను ఫీజులు కట్టి ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. తల్లికి వందనం జాబితాలో అర్హులుగా చూపించారు. మొదటి విడతలో డబ్బులు పడకపోవడంతో సచివాలయానికి వెళ్లి ఎంక్వయిరీ చేయగా రెండో విడతలో పడతాయని చెప్పారు. ఎంతకూ డబ్బులు రాకపోవడంతో మళ్లీ వెళ్లి వాకబు చేయగా.. 'విద్యాహక్కు చట్టంలో మీ పిల్లలు ఫ్రీ సీట్లు పొందడం వల్ల పెండింగ్‌లో పెట్టార'ని చెప్పారు. అసలు తాము ఫ్రీ సీట్లకు దరఖాస్తు చేయలేదని, ఎంఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేసి వారం అవుతున్నా ఫలితం లేదని ఆమె పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో ఆర్డీవోకు ఫిర్యాదు చేసి న్యాయం చేయమని కోరానని చెప్పారు.

పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం

- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ విజయ కృష్ణన్



పచ్చిరొట్ట ఎరువులపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: రైతులు పచ్చిరొట్ట పైరు వాడకం ద్వారా ఎరువుగా మారి మట్టికి జీవమిస్తుందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆమెతో పాటు జేసీ ఎం.జాహ్నవి, వ్యవసాయ శాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పైర్లను వాడడం ద్వారా 25 శాతం ఎరువులు ఆదా చేసుకోవచ్చని, పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం ఉంటుందని, పచ్చిరొట్ట ఎరువులు, పీఎండీ ఎస్ (వర్షాకాలానికి ముందు పొడి విత్తనాలు విత్తడం) వాడటం వల్ల నేల సారం పెరుగుతుందన్నారు. నేల నిర్మాణం పటిష్టం, ఆరోగ్యకరమైన నేల, నేలలో పోషకాల వృధా తగ్గింపు, సాగు ఖర్చులు తగ్గిస్తుందన్నారు. రైతులు జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులు ఆదా చేయవచ్చని, జీవన ఎరువులతో పంటకు బలం చేకూరుతుందని తెలిపారు. దీనికి సంబంధించి డీఎం (మార్క్ ఫెడ్) వారిని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు సేవ కేంద్రాల వద్ద గోడ పత్రికలను ప్రదర్శించాలని ఆమె తెలిపారు. ప్రైవేటు డీలర్లు కూడా గోడ పత్రికను ప్రింట్ చేసి ప్రతీ డీలరు షాపు ముందు ప్రదర్శించాలన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్, అనకాపల్లి మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి పాల్గొన్నారు.

ర్యాంకు వచ్చింది కానీ..

చేయాల్సింది ఇంకా మిగిలే ఉంది..

- స్వచ్ఛత ర్యాంకుల్లో నర్సీపట్నం మున్సిపాలిటీకి 30వ ర్యాంకు
- కలిసొచ్చిన పక్కా మరుగుదొడ్ల నిర్వహణ
- పారిశుధ్యంపై ప్రజల పెదవివిరుపు

నర్సీపట్నం: స్వచ్ఛ భారత్ లక్ష్యంలో భాగంగా 2024-25కు గాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వచ్ఛత ర్యాంకుల్లో నర్సీపట్నం మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 553, రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంకు సాధించింది. 50 వేల నుంచి మూడు లక్షల జనాభా కలిగిన మున్సిపాలిటీలు రాష్ట్రంలో 124 ఉన్నాయి. పక్కనే ఉన్న యలమంచిలి 59, తుని 68 ర్యాంకులు దక్కించుకున్నారు. నర్సీపట్నానికి 30వ ర్యాంకు రావడంతో పాటు ఓడీఎఫ్ ప్లస్ వరించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొన్ని అంశాల్లో మెరుగైన పనితీరు కనబరచడంతో ఇది సాధ్యమైంది. కేంద్ర బృందం మొత్తం 1200మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది. మరుగుదొడ్ల నిర్వహణలో మున్సిపాలిటీకి మంచి మార్కులే పడ్డాయి. అయితే తడి పొడి వ్యర్థాల నిర్వహణపై 34 శాతంమంది, ఇంటింటి చెత్త సేకరణపై 44 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసారి ఈ దిశగా దృష్టి పెడితే ర్యాంకు మరింత మెరుగుపడే అవకాశముంది.

తపనతో శ్రమించారు..

మున్సిపాలిటీలో 28 వార్డులు, 17 సచివాలయాలు ఉన్నాయి. 20,030 గృహాలు, 72 వేల జనాభా ఉంది. నిత్యం తడి, పొడి చెత్తతో పాటు ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేందుకు 90 మంది వరకు పారిశుధ్య కార్మికులు నిత్యం శ్రమిస్తున్నారు. ఇలా నిత్యం ఉత్పత్తి అవుతున్న 30 టన్నుల వ్యర్థాలను కాంపాక్టర్, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. స్వచ్ఛతలో మంచి ర్యాంకు సాధించాలనే తపనతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేశారు. మున్సిపాలిటీలో కల్పించిన సౌకర్యాలపై అధికారులు 3500 మంది నుంచి అభిప్రాయ సేకరణ చేసి నివేదించారు. కేంద్ర బృందం సుమారుగా 1200 మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది.

ఇవీ అవరోధాలు..

తడి,పొడి చెత్త సేకరణ పట్ల 34 శాతం మంది, ఇంటింటి చెత్త సేకరణ పట్ల 44 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. అరకొరగా ఉన్న సిబ్బందిలో ఇటీవల కొంత మంది పదవీ విరమణ చేశారు. 140 మంది కార్మికులకు గాను 90 మంది మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత కారణంగా తడి, పొడి చెత్త సేకరణ, ఇంటింటి చెత్త సేకరణలో అనుకున్న స్థాయిలో పురోగతి సాధించలేకపోయారు. సిబ్బంది సంఖ్య పెరిగితే పనితీరు మెరుగుపడడానికి అవకాశం ఉంటుంది. అంతే కాకుండా పారిశుధ్య పరిరక్షణలో ప్రజలను కూడా భాగస్వాములను చేసి, వారి బాధ్యతలను గుర్తు చేయాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం సాధ్యమవుతుంది.



మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన పింక్ టాయిలెట్లు



పురుషుల కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ టాయిలెట్లు



ట్రిపుల్ ఆర్ సెంటర్

ర్యాంక్‌కు దోహదపడిన అంశాలు..

- రోడ్ల మీద చెత్త కుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు తరలింపు
- ప్రజా మరుగుదొడ్ల వినియోగంలో విజయవంతం
- స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా ఎస్సీ కాలనీ, కొత్తవీధి, గవరవీధి ప్రాంతాల్లో ఆకర్షణీయమైన పింక్, గ్రీన్ టాయిలెట్ల ఏర్పాటు
- కాలువల్లో పక్కాగా పూడిక తీత పనులు
- బహిరంగ మల, మూత్ర విసర్జన నియంత్రణ
- ట్రిపుల్ ఆర్ సెంటర్ ఏర్పాటు
- పకడ్బందీగా తడి, పొడి చెత్త సేకరణ

మెరుగైన ర్యాంకు కోసం కృషి



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధనకు యంత్రాంగం అంతా సమష్టిగా పనిచేశాం. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో చక్కటి ప్రగతిని సాధించాం. మున్సిపాలిటీ ప్రజల చురుకైన భాగస్వామ్యం, పారిశుధ్య నిర్వహణ పట్ల పెరిగిన చైతన్యం వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయి. తడి, పొడి చెత్త సేకరణలో కొంత వెనకబడ్డాం. భవిష్యత్తులో మంచి ర్యాంకు సాధించేందుకు కృషి చేస్తాం. ర్యాంకు సాధనకు దోహదపడిన ప్రస్తుత చర్యలను మరింత పకడ్బందీగా అమలు చేస్తాం.

– జంపా సురేంద్ర, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

కట్టిన చీరే కట్టాలి..

అవే పూలు పెట్టుకోవాలి !

- ఫేస్ యాప్‌పై పెల్లుబుకుతున్న ఆగ్రహం
- పోషకాహారం పంపిణీలో నిబంధనాలు
- బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది నిరసన ప్రదర్శన



నక్కపల్లి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, వర్కర్లు

నక్కపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహార పంపిణీకి సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సరకులన్నీ ఒకసారి ఇవ్వడం లేదు. దఫదఫాలుగా ఇస్తున్నారు. మొదటిసారి సరకులు తీసుకునే సమయంలో ఏ చీర కట్టుకున్నారో, ఏ పూలు పెట్టుకున్నారో అవే చీర, జాకట్టు, పూలు పెట్టుకుని వస్తేనే రెండోసారి ఫొటో తీయడానికి వీలు పడుతోంది. ఇదెక్కడి న్యాయం, ఇదేం పద్ధతి, ఎప్పుడూ చూడలేదు.. అంటూ లబ్ధిదారులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానంలో సరకులు పంపిణీ చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన పలువురు గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ వర్కర్లు నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ విధానాన్ని రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వాటి పరిధిలో 1810కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. సరకులను ఆన్‌లైన్ విధానంలో సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులను కేంద్రాలకు పిలిచి ముందుగా అంగన్‌వాడీ వర్కర్ ఫొటో తీసుకుని అప్‌లోడ్ చేసి, లాగిన్ అయిన తర్వాత లబ్ధిదారుడి ఫోటో, వారికి ఇచ్చిన సరకులు ఫోటోలు తీసి ఆన్‌లైన్ చేయాలి. ఇటువంటి సమయంలో సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తే సరకులు ఇవ్వడానికి కుదరదు. లబ్ధిదారులను కేంద్రాలకు పిలిచి ఆన్‌లైన్ విధానంలో ఇచ్చే సమయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నామని, నెట్‌వర్క్ సరిగా రాకపోవడం, ఫోన్‌లు సరిగా పనిచేయకపోవడంతో ఈ ఫేస్ యాప్ ఓపెన్ కావడం లేదని వర్కర్లు వాపోతున్నారు. ఇలాంటి సమస్యలు ఎదురయినప్పుడు లబ్ధిదారులను గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సివస్తోందని లేదా మరోసారి పిలవాల్సి వస్తోందని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో సంతకాలు తీసుకుని సరకులు ఇచ్చేసేవారని, ఈ ప్రభుత్వంలో ఆన్‌లైన్ విధానంలో పంపిణీ చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. సరకుల కోసం ఐదారు సార్లు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ ఫేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నిసార్లు రావాలి..



పోషకాహార సరకులు తీసుకోవడానికి అంగన్‌వాడీ కేంద్రాలకు రమ్మంటున్నారు. వచ్చేక ఫేస్‌యాప్‌లో ఫొటో తీసి అప్లోడ్ చేసే సమయంలో పలు సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయి. గంటల తరబడి అక్కడే ఉండాల్సి వస్తోంది. ఒక్కొక్కసారి పది, పదిహేనుసార్లు కేంద్రాలకు రావాల్సి వస్తోంది. ఇదెక్కడి న్యాయం. లబ్ధిదారులను యాప్‌ల పేరుతో ఇబ్బంది పెట్టడం సరికాదు. ఇచ్చే కొద్దిపాటి సరకులకు ఇన్ని నిబంధనలు విధించడం కరెక్ట్ కాదు.

–శిరీష, ఎస్.రాయవరం మండలం

ఇదేం పద్ధతి?



రెండేళ్ల చిన్నారికి తల్లిని. ఇచ్చే సరకుల కోసం పది పది, హేను సార్లు కేంద్రాలకు రమ్మంటున్నారు. రెండు లీటర్ల పాలు, 25 కోడి గుడ్ల కోసం 20 సార్లు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. బియ్యం తీసుకున్న తర్వాత వారం రోజులకు పప్పులు ఇస్తున్నారు. వాటిని తీసుకునే సమయంలో ముందు తీసుకున్న సరకులకు ఏ చీర, డ్రెస్ వేసుకున్నామో అవే వేసుకుని రావాలంట. ఇదేం పద్ధతి. గతంలో సంతకాలు తీసుకుని ఇచ్చేసేవోళ్లు. ఇప్పుడు అలా కుదరదంటున్నారు.

–చిట్టుమూరి రత్నమ్మ, కాగిత, నక్కపల్లి

నిర్ణీత ధరలకు ఎరువుల విక్రయం

- డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి విజ్ఞప్తి

అనకాపల్లి:

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి డీలర్ సకాలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు కోరారు. అనకాపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో అనకాపల్లి, కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన ఎరువులు, విత్తన, పురుగు మందుల విక్రయ డీలర్లకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం ప్రతి రైతుకు ఆధార్ కార్డు అనుసంధానంతో ఎరువులు విక్రయించాలన్నారు. సరుగుడు, గడ్డి సాగు అవసరాలకు ఎరువులు విక్రయించరాదన్నారు. గడ్డి పెంపుదలకు ఎరువులు వాడరాదన్నారు. ఈ విషయాన్ని సంబంధిత రైతులకు స్పష్టం చేయాలన్నారు. సబ్ డివిజన్ వ్యవసాయ అధికారి సిహెచ్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి నెల విధిగా స్టాక్ బోర్డుపై ధరలు, స్టాక్ నిల్వలు ప్రదర్శించాలన్నారు. గడువు తేదీ దాటిన పురుగు మందులను విక్రయించరాదన్నారు. నకిలీవి విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు, వ్యవసాయ విస్తరణాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయానికి 35 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మోహన్‌రావు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి సోమవారం 35 అర్జీలు అందాయి. ఎస్పీ కార్యాలయంలో అర్జీదారుల నుంచి అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చాయని తెలిపారు.

గురుకులంలో మిగుల సీట్లు గిరిజనులకు కేటాయించాలి

- పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతి

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మిగుల సీట్లను గిరిజన విద్యార్థులకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ తెనుగుపూడి గురుకుల విద్యాలయం ఎస్సీ స్పెషలైజేషన్ కావడంతో గిరిజన విద్యార్థులకు పరిమిత సీట్లు ఉన్నాయన్నారు. ప్రతి ఏటా సీట్లు మిగిలిపోతున్నాయని, వాటిని గిరిజన విద్యార్థులతో భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరామన్నారు. మాడుగుల నియోజకవర్గంలో గిరిజనులకు గురుకుల పాఠశాలలు లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వచ్చేనెల 6న స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక వచ్చే నెల 6న జరగనుంది. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న 10 మంది స్థాయీ సభ్యుల కాల పరిమితి ముగియనున్నందున, కొత్తవారిని ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఓటర్ల జాబితా, ఎలక్షన్ నోటీస్ ప్రచురించారు. నామినేషన్ పత్రాలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న కార్యదర్శి విభాగం పని వేళల్లో పొందవచ్చన్నారు. ఈ నెల 29 వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు అదనపు కమిషనర్(జనరల్) కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 29న సాయంత్రం 5 వరకు అందిన నామినేషన్ల జాబితాను ప్రచురించి, 30న ఉదయం 11 నుంచి నామినేషన్ల పరిశీలన, సాయంత్రం అర్హుల జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 2 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుగా పేర్కొన్నారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

ఆక్రందన.. వేదన

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు అర్జీల వెల్లువ

భూకబ్జాలు, ఆక్రమణలపై నిరసనలు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి, జిల్లా అధికారులు

ఇటీవల బదిలీల్లో భాగంగా ఎంబీ పట్నం సచివాలయం వీపీఏగా చేరడానికి వెళ్లిన తనకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోస్టింగ్ ఇవ్వొద్దని చెప్పడంతో ఎంపీడీవో హోల్డ్‌లో పెట్టినట్టు ఓ మహిళా ఉద్యోగిని ఆక్రందన.

- ఎటువంటి సమాచారం లేకుండా చేపడుతున్న భూముల సర్వేను తక్షణమే నిలిపివేసి గ్రామాన్ని కాపాడాలని మునగపాక మండలం నారాయుడుపాలెం గ్రామస్తుల విజ్ఞప్తి.
- భూకబ్జాలు, అనధికారిక భూసర్వేలు, లేఅవుట్ల కోసం సాగునీటి చెరువుల్లో పక్కా రోడ్ల నిర్మాణంపై పలు గ్రామాల ప్రజలు సంఘటితమై కలెక్టరేట్ గేటు వద్ద వేర్వేరు సమయాల్లో నిరసనలు..
- ఇలా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల ఆవేదనలు, ఆక్రందనలు, విన్నపాలు కనిపించాయి. సమస్యల పరిష్కారంలో అధికారుల సాయం కోసం చేతులు జోడించి వేడుకున్నారు.

– తుమ్మపాల

గొలుగొండ రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు

గిరిజనుల స్వాధీనానుభవంలో ఉన్న సాగు భూములను సమీప గ్రామస్తులతో తప్పుడు పంచనామా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్న గొలుగొండ రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ పాతమల్లంపేట పంచాయతీ శివారు బొడ్డడపాడు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెం.844/2లో 26 ఎకరాల మెట్ట భూమిలో సాగు చేస్తున్న గిరిజనులు, రైతులను విచారించకుండా రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు తయారు చేసి స్థానికేతరులకు భూములు పంచేందుకు రికార్డుల్లో పేర్లు నమోదుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అటువంటి చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు.

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 213 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు 213 అర్జీలు అందాయి. కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు జేసీ ఎం.జాహ్నవి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి 121, సర్వే విభాగం 13, పంచాయతీ రాజ్ 12, సమగ్ర శిక్ష 10, మరికొన్ని శాఖలకు ఈ అర్జీలు వచ్చాయి. కలెక్టరేట్ గేటు ఎదుట ఆందోళనలు చేసిన ప్రజలను రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపు చేశారు.

మంచినీరు ఇవ్వండి మహాప్రభో.!


మంచినీటి కోసం నిరసన తెలుపుతున్న బంగారయ్యపేట దళిత మహిళలు

మంచినీటి కుళాయిలు పాడై 10 రోజులు గడుస్తున్నా పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదని, మంచినీరు అందించి దాహం తీర్చాలంటూ కశింకోట మండలం బంగారయ్యపేట ఎస్సీ కాలనీ దళిత మహిళలు పిల్లలతో వచ్చి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మంచినీరు సరఫరా కావడం లేదని సచివాలయంలో మొత్తుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని, దళితులుగా ఉన్న తమను ఇప్పటికీ అంటరాని వారిగానే చూస్తున్నార ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తా చెదారం వేసే మురుగు కూపం వద్ద ఉన్న కుళాయికి పోయి నీరు తెచ్చుకోవాలంటున్నారు గానీ, ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటిని మాత్రం సరఫరా చేయడం లేదని వాపోయారు. కాలనీలో ఉన్న బోరు కూడా మూడేళ్లుగా పని చేయడం లేదని, తక్షణమే అధికారులు స్పందించి మంచినీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

అనధికార లేఅవుట్ కోసం చెరువు కబ్జా


చెరువును కాపాడాలంటున్న వెంకన్నపాలెం పంచాయతీ వార్డు మెంబర్లు

అనధికార లేఅవుట్ కోసం చెరువును కబ్జా చేశారంటూ చోడవరం మండలం వెంకన్నపాలెం పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు కలెక్టరేట్‌లో సోమవాం ఫిర్యాదు చేశారు. కబ్జాదారుల చెర నుంచి చెరువును స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సర్వే నంబర్ 527లో చెరువు భూమిలో పంచాయతీ నిధులతో నిర్మించిన డంపింగ్ యార్డ్‌ను మూసి, అందులో నుంచి తారు రోడ్డు నిర్మించి కొందరు వ్యక్తులు లేఅవుట్ వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పంచాయతీ సర్పంచ్, వీఆర్వో, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. అలాగే ఉపాధి హామీ పథకంలో దొంగ మస్తర్లు వేసి పనికి రాని వారికి కూడా బిల్లులు చెల్లిస్తూ అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

10- 15 తేదీల మధ్య తాండవ నీరు విడుదల


మాట్లాడుతున్న తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం: ఖరీఫ్ సాగుకు వచ్చే నెల 10 నుంచి 15వ తేదీలోపు తాండవ రిజర్వాయరు నీరు విడుదల చేయాలని నిర్ణయించామని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. స్థానిక తాండవ ప్రాజెక్టు సెక్షన్ కార్యాలయంలో సోమవారం ఆయకట్టుదారులతో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె. సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఈ అనురాధ మాట్లాడుతూ సోమవారం ఉదయానికి ప్రాజెక్టులో నీటిమట్టం 389.2 అడుగులు ఉందన్నారు. ప్రస్తుతం నీరు విడుదల చేస్తే ఖరీఫ్ సాగుకు 60 రోజులే సరిపోతుందన్నారు. వర్షాలు పడితే ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుందన్నారు. ఏటా రెండు జిల్లాల పరిధిలో 52 వేల ఎకరాల్లో సాగు చేస్తారన్నారు. నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రైతులు, ప్రజా ప్రతినిధులు ఆగస్టు 10 నుంచి 15వ తేదీలోపు ఏదో ఒక్క తేదీన నీరు విడుదల చేయాలని కోరారు. ఈ లోపు కాలువ పూడిక తీత పనులు పూర్తి చేయాలన్నారు. శివారు ఆయకట్టుకు సైతం నీరందించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. నాతవరం జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, తాండవ ప్రాజెక్టు వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగుబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, పాములవాక మాజీ సర్పంచ్ వేచలపు జనార్దన్, తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్ కుమార్, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


దేవరాపల్లి ఎస్‌ఐ వి.సత్యనారాయణ

దేవరాపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసి, వారి నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో వాలాబు రోడ్డులో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. రెండు బ్యాగులతో అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిని విచారించగా తమకు గంజాయి సేవించే అలవాటు ఉందని, చెన్నై నుంచి పాడేరు మీదుగా ఒడిశా వెళ్లి 4 కేజీల గంజాయిని రూ.8 వేలుకు కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. విశాఖపట్నం మీదుగా చెన్నై చేరుకునేందుకు పినకోట మీదుగా దేవరాపల్లి వైపు వస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇద్దర్నీ చోడవరం కోర్టులో హాజరు పరిచామన్నారు. నిందితులు అలె పండియన్, మహాకుమార్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారని ఎస్‌ఐ తెలిపారు.

కుంగిన కల్వర్టు.. ఆగిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

- విశాఖ నుంచి కృష్ణారాయుడిపేట వరకే బస్సులు
- ప్రయాణికులకు తప్పని పాట్లు


బస్సు సర్వీసులు నిలిపివేయడంతో వెలవెలబోతున్న దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ

దేవరాపల్లి: దేవరాపల్లి నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నం వెళ్లే రహదారిలో కృష్ణారాయుడుపేట వద్ద కల్వర్టు కుంగిపోవడంతో సోమవారం 12డీ, 68డీ ఆర్టీసీ బస్సు సర్వీసుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో నిత్యం పదుల సంఖ్యలో బస్సులు, వందలాది మంది ప్రయాణికులతో కళకళలాడే దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోయింది. ఆర్‌అండ్‌బీ అధికారులు కుంగిన కల్వర్టుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి, రాకపోకలు నిలిపివేశారు. విశాఖపట్నం నుంచి ఆనందపురం, దేవరాపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు కృష్ణారాయుడుపేట వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి ఆటోల్లో ప్రయాణించి గమ్యస్థానాలను చేరుకుంటున్నారు. కొత్తవలస వైపు వెళ్లాల్సిన వారు ఆనందపురం నుంచి కృష్ణారాయుడుపేట వరకు ఆటోల్లో వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రైవేటు వాహనచోదకులు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్లు పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులకు ముందు చూపు లేని కారణంగానే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. బస్సు సర్వీసుల నిలిపివేత విషయాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం సహా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీసుకెళ్లారు.

దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కల్వర్టు నిర్మాణానికి సుమారు రూ.90 లక్షల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయని, వారంలోగా టెండర్ పూర్తి చేసి పనులు చేపడతామన్నారు.

నాన్ బెయిలబుల్ వారెంట్ నిందితుడి అరెస్ట్


నిందితుడితో టౌన్ సీఐ గోవిందరావు

నర్సీపట్నం : పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు కేసుల్లో నాన్ బెయిల్‌బుల్ వారెంట్ కలిగిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, శివపురానికి చెందిన కె.శివకుమార్‌పై వ్యక్తులపై దాడికి సంబంధించి క్రైమ్ నెంబరు 02/2016, 268/17, 223/2019 మూడు కేసులు ఉన్నాయన్నారు. నిందితుడిని పాడేరులో అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరు పరిచామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అతనిని సబ్‌జైల్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రైతు బిడ్డకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టాతో గట్రెడ్డి రాజు

రావికమతం : మండలంలోని దొండపూడికి చెందిన గట్రెడ్డి రాజు ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. గిరిజన జాతుల జీవిత అభివృద్ధిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పాత్రను ఆర్థిక కోణంలో పరిశోధించి విశ్లేషించినందుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం నుంచి ఆయన డాక్టరేట్ స్వీకరించారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఆదినాయుడు, పెంటమ్మ కుమారుడు రాజు 1 నుంచి 7 తరగతి వరకు దొండపూడి ప్రభుత్వ పాఠశాలలో, 8 తరగతి నుంచి 10 వరకు కొత్తకోట ప్రభుత్వ హైస్కూలు, ఇంటర్(హెచ్ఈసీ) కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్‌గా, డిగ్రీ (బీఏ) చోడవరం ప్రభుత్వ కళాశాలలో, ఎంఏ (ఎకనామిక్స్) ఆంధ్ర యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ నుంచి రెండు బంగారు పతకాలు సాధించారు. ప్రతిష్టాత్మకమైన యూజీసీ జూనియర్ రీసెర్చ్ ఫెలో, ఆంధ్రప్రదేశ్ సెట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. రాజు ప్రస్తుతం ఇండిపెండెంట్ ఎకానమిక్ కన్సల్టెంట్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ప్రొఫెసర్స్ నరేష్‌కుమార్ శర్మ, ఫణీంద్ర గోయారి పర్యవేక్షణలో పరిశోధన జరిపారు. రాజుకు డాక్టరేట్ రావడం పట్ల దొండపూడి గ్రామ పెద్దలు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

జగనన్నను కలిసి మాట్లాడతా..

- ఆ తర్వాతే రాజీనామాపై తుది నిర్ణయం
- ఎంపీపీ బొలిశెట్టి గోవిందు


మాట్లాడుతున్న ఎంపీపీ గోవిందు

నక్కపల్లి/ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన తర్వాత రాజీనామాపై తుది నిర్ణయం ప్రకటిస్తానని ఎస్.రాయవరం ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు తెలిపారు. సోమవారం ఆయన ఎస్.రాయవరంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీకి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేతను కలసి సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కల్పించకపోవడంతో మనస్తాపం చెందానన్నారు. పార్టీ నేతలు, తన అభిమానులు వచ్చి త్వరలోనే జగనన్నను కలిసి సమస్యలు వివరిద్దామని, రాజీనామాపై పునరాలోచన చేయాలని కోరారన్నారు. పార్టీ పెద్దలు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తదితరులు తనతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారన్నారు. త్వరలోనే పార్టీ అధినేత జగన్ అపాయింట్‌మెంట్ ఇప్పించి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గొలుగొండ: గొలుగొండ కనకదుర్గ వీధిలో విద్యుదాఘాతంతో పాసింబిల్లి శివ(42) సోమవారం మృతి చెందాడు. తన ఇంటిపై గోడ కడుతున్న సమయంలో సమీపంలో ఉన్న 11కేవీ లైన్ వైర్లు తగిలి శివ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే శివ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైలు ఢీకొని పశువుల కాపరి మృతి

పాయకరావుపేట: రైలు ఢీకొని ఓ పశువుల కాపరి మృతి చెందాడు. తుని రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన పక్కుర్తి చిన మాధవరావు(58) మేకలను తోలుకుంటూ సోమవారం స్థానికంగా ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో పట్టాల పైకి వెళ్లిన మేకలను పక్కకు తోలడానికి వెళ్లిన ఆయనను విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు ఢీకొట్టింది. మాధవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి తుని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

ఏఎంసీ సెక్రటరీపై క్రమశిక్షణ చర్యలు

అనకాపల్లి: యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన ఎం.సత్యనారాయణమూర్తిపై ఆరోపణలు రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అగ్రికల్చర్ విజిలెన్స్ విభాగం జరిమానా విధించింది. 2022 ఏప్రిల్ 4న అనకాపల్లి రాజుపేటకు చెందిన జీడిపప్పు ఫ్యాక్టరీ లైసెన్స్ చెల్లుబాటు తేదీ గడువు పెంచినట్లు వచ్చిన ఆరోపణలపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. అసిస్టెంట్ సెక్రటరీ నిర్ణయాలతో మార్కెట్ కమిటీ రుసుం బాగా తగ్గింది. దీంతో అగ్రికల్చర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో విజిలెన్స్ విభాగం జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సత్యనారాయణమూర్తి ప్రస్తుతం కోనసీమ జిల్లా రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో గ్రేడ్–3 సెక్రటరీగా పనిచేస్తున్నారు.

ఏయూలో బీటెక్ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు

- ఈఏపీ సెట్ ద్వారా అడ్మిషన్లు
- తొలి ఏడాది 30 మందికి ప్రవేశాలు
- పలు అంశాలకు ఏయూ అకడమిక్ సెనేట్ ఆమోదం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్స్‌కు సెనేట్ ఆమోదం తెలిపింది. సోమవారం నిర్వహించిన అకడమిక్ సెనేట్ సమావేశంలో సభ్యులు ఈ మేరకు తీర్మానించారు. ఈ కోర్సులో ప్రవేశాలను ఈఏపీ సెట్ ద్వారా నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ విభాగం నిర్వహించే ఈ కోర్సులో తొలి బ్యాచ్‌లో 30 మందికి ప్రవేశాలను కల్పించనున్నారు. ఈ మేరకు సెనేట్ పలు తీర్మానాలకు ఆమోదం తెలిపింది.

- మెటీరియాలజీ ఓషనోగ్రఫీ విభాగం నుంచి గతంలో నిలిపివేసిన ఎంటెక్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఓషియానిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి పునఃప్రారంభించాలని నిర్ణయించింది.
- ఇంజనీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో డ్యూయల్ డిగ్రీ చేయడానికి ఆమోదం తెలిపింది.
- ఏయూ దూర విద్య కేంద్రం నుంచి అన్ని పీజీ కోర్సులకు వార్షిక పరీక్షల స్థానంలో సెమిస్టర్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించింది.
- సైన్స్ కళాశాల పరిధిలో పలు విభాగాల్లో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించింది.
- మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగం నుంచి ఆక్వా కల్చర్‌లో ఏడాది కాలవ్యవధితో పీజీ డిప్లమో కోర్సుకు ఆమోద ముద్ర వేసింది.

సెనేట్ సమావేశంలో భాగంగా మాజీ ఉపకులపతులు మాట్లాడుతూ ఏయూ చిత్రకళా విభాగం, థియేటర్ ఆర్ట్స్ విభాగాలను సమన్వయం చేస్తూ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఏర్పాటును ప్రతిపాదించారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను బలోపేతం చేయాలని సూచించారు. దీనికి వీసీ రాజశేఖర్ త్వరలోనే సమగ్ర ప్రతిపాదనలతో ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయ విధివిధానాలను వివరించారు.

సమావేశంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయ రావు, మాజీ వీసీలు ఆచార్య ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, ఫ్యాకల్టీ చైర్మన్లు, అకడమిక్ సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

కలగానే.. ఈఎస్‌ఐ ఆస్పత్రి

- పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రికి కార్మికుల డిమాండ్
- దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఏ చిన్న ప్రమాదం జరిగినా విశాఖ, అనకాపల్లి టౌన్‌కు పరుగులు


జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ వ్యూ

పరవాడ: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని కొన్నేళ్లుగా కార్మిక వర్గం మొరపెట్టుకుంటోంది. అయినా తమ అభ్యర్థనను పట్టించుకునే నాథుడే లేడంటూ వాపోతోంది. ఇక్కడ పరవాడ ప్రాంతంలో జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, ఇండస్ట్రియల్ పార్క్ వంటి పరిశ్రమలు ఏర్పాటై పాతికేళ్లు దాటింది. జేఎన్ ఫార్మాసిటీలోనే 108 పరిశ్రమల్లో సుమారు 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. సింహాద్రి ఎన్టీపీసీలో 1600 మంది కార్మికులున్నారు. వీరంతా ఈఎస్‌ఐ చెల్లిస్తున్నారు. అయినా వాటి ప్రయోజనాలు పూర్తిగా పొందలేకపోతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు

ఇక్కడి పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో క్షతగాత్రులైన కార్మికులకు అత్యవసర వైద్య సేవలందించేందుకు స్థానికంగా ఎలాంటి ఆస్పత్రులూ లేవు. ఏ చిన్న ప్రమాదం జరిగినా బాధితులను విశాఖ, అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించడానికి అంబులెన్స్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే. స్థానికంగా ఈఎస్‌ఐ ఆస్పత్రి సదుపాయం లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు కూడా మెరుగైన వైద్య సేవలు పొందలేని పరిస్థితి. వీరికి ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోంది.

ప్రారంభించకుండానే మూసేశారు

కార్మికులు ఎదుర్కొంటున్న అవస్థల నేపథ్యంలో పరవాడ ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కార్మిక వర్గాలు కొన్నేళ్లుగా గగ్గోలు పెడుతున్నా ఈఎస్‌ఐ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టని పరిస్థితి. గతంలో పరవాడలో ఈఎస్‌ఐ అధికారులు తాత్కాలిక ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేసి, దాన్ని తెరవకుండానే ఇటీవల మూసేశారు. ఫలితంగా ఏ చిన్న ప్రమాదం జరిగినా, అనారోగ్య సమస్యలు తలెత్తినా దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం

▲పేరుకుపోయిన చెత్త కుప్పలు ▲ రహదారులపై మురుగునీరు, పారని కాలువలు
▲భరించలేని దుర్వాసన, దోమలతో ఇక్కట్లు ▲ ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు


కొత్తూరు శారదానగర్ ఒకటో వీధిలో స్కూల్ పక్కనే పేరుకుపోయిన మురుగునీరు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం ... ఇళ్లతోపాటు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అప్పుడే మన మంతా ఆరోగ్యంగా ఉంటాం.. ఇటువంటి వ్యాఖ్యలతో అధికారులు, పాలకులు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను తూతూమంత్రంగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు. దాంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. ఈగలు, దోమలు ఆవాసంగా చేసుకుని వ్యాధులకు కారకమవుతున్నాయి.


ఎంపీపీ స్కూల్ ఎదుటే శుభ్రం చేయని కాలువ

అనకాపల్లి టౌన్: గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. రోడ్ల పక్కనే చెత్త కుప్పలు, శుభ్రం చేయని కాలువలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ ఆశయాలు కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నా ఇక్కడ మాత్రం అవి నెరవేరడం లేదు. ప్రధానంగా మండలంలోని మేజర్ పంచాయతీలైన కొత్తూరు, తుమ్మపాలలో పారిశుధ్యం పడకేసింది. ఏ వీధి చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పిల్ల కాలువల దగ్గర నుంచి ప్రధాన కాలువల వరకు పూడికలు తీయడం లేదు. వర్షం వస్తే చాలు కాలువలు పారక వర్షం నీరంతా ఇళ్లలోకి చేరుతోంది.

ఇళ్ల మధ్యలోనే మురుగు

కొత్తూరు ఒకటో వీధిలో ఇళ్ల మధ్యలోనే మురుగు నిలిచిపోయింది. ఇది దోమలకు నిలయంగా మారింది. పలు వీధుల్లో వర్షం వస్తే మురుగునీరు అంతా రోడ్లపై పారుతోంది. దీనికి ప్రధాన కారణం కాలువలపై ఇళ్లు, మెట్లు కట్టేశారు. శారదానగర్ ఒకటో వీధిలో మురుగు గుంట చెరువును తలపిస్తోంది. అందులో పందులు సంచరిస్తున్నాయి. సమీపంలోనే ఒక స్కూల్ ఉంది. ఆ విద్యార్థులు మురుగు గుంటలో పెరిగే దోమల బారిన పడే ప్రమాదముంది.

కానరాని ఫాగింగ్, లార్విసైడ్ పిచికారీ

తుమ్మపాల మెయిన్‌రోడ్డు ఆనుకొని ఉన్న చినబాబు కాలనీ, గరవపేట వీధి, సాయిబాబా గుడిలైన్, సంతలైన్, జవహర్‌లాల్ నెహ్రూ మార్గ్, ఎన్టీఆర్ మార్గ్, తుమ్మపాల సంత లైన్, పంచాయతీ ఆఫీస్ లైన్ ఇలా ఏ వీధుల్లో చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని వీధులలో కాలువలు లేకపోవడం వల్ల మురుగు నీరు అంతా రోడ్డుపై పారుతోంది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ ఆఫీస్ ఎదురుగా ఎంపీపీ స్కూల్ ముందర కాలువలే పారడం లేదు. ఈ కాలువల వల్ల **వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది విద్యార్థు**లను కుడితే వారికి డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఈ వ్యాధికి కారణమైన దోమలు వర్షాకాలంలో నీరు నిలిచిపోయే ప్రదేశాలలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. అసలు గ్రామాల్లో ఫాగింగ్, లార్విసైడ్ పిచికారీ వంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. పంచాయతీలకు లక్షలాది రూపాయలు నిధులు వస్తున్నా అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోతున్నారు. గ్రామంలో పంచాయతీ నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రోడ్డు డివైడర్‌పైనే చెత్త



వీధుల్లో చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. తుమ్మపాల వెళ్తున్న రోడ్డు డివైడర్‌పైనే చెత్తను పోసున్నారు. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రోజూ చెత్త కుప్పలను ఎత్తే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.

–వరహాలు, చినబాబు కాలనీ

విపరీతంగా దోమలు



మురుగు కాలువల్లో నీరు పారడం లేదు. ప్రధాన కాలువ పారడం లేకపోవడమే కారణం అవ్వొచ్చు. దోమల నివారణకు పిచికారీ చేపట్టడం లేదు. వర్షాకాలం కావడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. పంచాయతీ సిబ్బంది వీధుల్లో చెత్తను శుభ్రం చేసే విధంగా రిక్షాలను ఏర్పాటు చేయాలి.

– ఎ ప్రకాష్, తుమ్మపాల


తుమ్మపాల వీధిలో రోడ్డు పక్కనే భారీ చెత్తకుప్ప



పంచాయతీ ఆఫీస్ పక్కనే శాఖా గ్రంథాలయం ఎదుట చెత్తకుప్ప

క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం


వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు త్రినాథరావు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు రాజకీయాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు త్రినాథరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇందులో భాగంగా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలతో సాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క బెల్టు షాపు లేదని, ప్రభుత్వమే మద్యం విక్రయాలు చేసేదన్నారు. కూటమి పాలనలో నేడు ఏ గ్రామానికి వెళ్లినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని, మద్యం ఏరులై పారుతుందన్నారు. కుటుంబాల జీవితం ఛిన్నాభిన్నం అవుతుందన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ తరుపున ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు.

కిడ్నీ సమస్యలపై ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు


క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: మండలంలోని మాకవరం, మార్టూరు గ్రామాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలపై ఉచిత స్క్రీనింగ్ పరీక్షల క్యాంప్‌లు సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై క్యాంప్‌ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ, క్రషర్‌ల పరిధి గ్రామాల ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముందస్తు జాగ్రత్తల చర్యలో భాగంగా గ్రామస్తులందరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సూపరింటెండెంట్ కృష్ణారావు, తుమ్మపాల పీహెచ్‌సీ డాక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాలగ్రామాల మాల తయారీ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి సాలగ్రామాలతో మాల తయారు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. నేపాల్‌లోని గండకి నదిలో లభ్యమయ్యే సాలగ్రామాలతో తయారు చేయించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. దాతలు, భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చునన్నారు. మాల తయారీలో ఉపయోగించే ఒక్కొక్క సాలగ్రామానికి రూ.650 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయలు దాదాపు స్థిర ధరలకు అమ్మకాలు సాగాయి. కిలో ఉల్లి, బంగాళదుంప రూ.30, టమాటా, బెండకాయ, దొండకాయ, చిలకడ దుంప, వంకాయ, క్యాబేజి రూ.40, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, చామదుంప రూ.60, క్యాప్సికం రూ.వంద, పాదు చిక్కుడు రూ.120కి అమ్మకాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 79 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,550	3,850
మూడో రకం	3,100	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	: మై బేబి
సత్యనారాయణ స్క్రీన్-1	:జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	:కన్నప్ప
పర్తిసాయి	:ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: కొత్తపల్లిలో ఒకప్పుడు
వెంకటేశ్వర	: మిస్టర్ రెడ్డి
శ్రీ సత్య	: ఏమాయ చేసావె
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-25, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 314 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కూటమి పాలనలో పెరిగిన సమస్యలు


వేదురివారి వీధిలో ప్రజలతో మాట్లాడుతున్న రమేష్

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రజా సమస్యలు పెరిగిపోయాయని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తెలిపారు. పట్టణంలోని 83వ వార్డు పరిధిలో లక్ష్మీదేవిపేట, వేదురివారి వీధి, కృష్ణుని మందిరం రహదారిలో విద్యుత్ లైట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిధిలో రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వార్డు పరిధిలో గత వైఎస్సార్‌సీపీ పాలనలో 90 శాతం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. త్వరితగతిన మరమ్మతులు చేసేందుకు జోనల్ కమిషనర్‌తో మాట్లాడడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు కొమ్మన శంకర్, మహిళలు పాల్గొన్నారు.

కశింకోటలో పారిశుధ్య నిర్వహణ


మురుగు కాలువలను శుభ్రపరుస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో సోమవారం పారిశుధ్య కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేశారు. కాలువల్లో చెత్త, షిల్టు తొలగించారు. వీధుల్లో చెత్తను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్. రామచంద్రరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పారిశుధ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

బండిగాడి వీధిలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు


బండిగాడి వీధిలో పార్కింగ్‌కు ఏర్పాటు చేయబోయే ఖాళీ స్థలం

అనకాపల్లి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి చెందిన రెండెకరాల ఖాళీ స్థలాన్ని ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ఇక్కడి పాలకులతో మాట్లాడి పార్కింగ్ సమస్య పరిష్కారాన్ని కనుగొన్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత పట్టణంలో విశాఖపట్నానికి దీటుగా అనేక బంగారం, వస్త్ర, షాపింగ్ మాల్స్ వెలిశాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా అనేక సెల్ షాపులు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు విచ్చలవిడిగా పెరిగాయి. ఈ వ్యాపారమంతా నెహ్రూచౌక్ జంక్షన్ నుంచి సత్యనారాయణ థియేటర్ వరకు మాత్రమే అత్యధికంగా జరుగుతుంది. ఈ మార్గంలోనే కాయగూరలు, బట్టలు, ఎలక్ట్రానిక్స్, చెప్పులు, తినుబండారాలు, ఇలా మనిషికి కావల్సిన అన్ని రకాల నిత్యావసర వస్తువుల షాపులు ఉన్నాయి. వీటిలో కొనుగోలు చేయడానికి నిత్యం వివిధ గ్రామాల ప్రజలు, పట్టణ వాసులు వందలాది మంది ద్విచక్ర వాహనాలు, కార్లతో షాపులకు వస్తుంటారు. కారణాలు ఏమైనప్పటికీ ఒకటి రెండు షాపులు తప్పితే ఏ షాపుల్లోనూ సెల్లార్స్ లేవు. దీంతో ఈ వాహనాలన్నీ రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీన్ని పరిష్కరించడం పోలీసులకు తలకు మించిన పని అవుతోంది. ఈ వాహనాలన్నీ మెయిన్ రోడ్‌కు వందమీటర్ల దూరంలో బండి గాడి వీధి చివరన ఖాళీ స్థలంలో నిలిపే విధంగా పోలీసులు స్థలాన్ని చదును చేయిస్తున్నారు. దీంతో అనకాపల్లిలో ట్రాఫిక్ కష్టాలు తీరినట్లేనని చెప్పవచ్చు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

అనకాపల్లి: అంగన్‌వాడీలకు ఎఫ్. ఆర్.ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, 5జీ మొబైల్స్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో మండలంలో కొత్తూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగులు ధర్నా చేపట్టారు. యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగేశు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు పని ఒత్తిడిలో భాగంగానే రెండు రకాల యాప్‌లు తీసుకొచ్చిందన్నారు. సిగ్నల్ సరిగా అందకపోవటం, బాలింతలు లబ్ధిదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉండే విధంగా ఈ యాప్ రికగ్నైజేషన్ సిస్టం అమలు చేశారన్నారు. దీంతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని వాపోయారు. తక్షణమే యాప్‌ను రద్దు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన ఫోన్లన్నీ 2జి మొబైల్స్ కావడంతో పనికిరాకుండా పోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే 5జీ మొబైల్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పరమేశ్వరరావు, అంగన్‌వాడీ ఉద్యోగులు ఎన్ వరలక్ష్మి, వి. కృష్ణవేణి, సిహెచ్ రామలక్ష్మి, తులసి, ఎస్. విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో భారీ వర్షం


కశింకోటలో వర్షం కురవడంతో గవరపేట రోడ్లపై పారుతున్న నీరు


మురుగుతో కలిసి రోడ్లపై పారుతున్న వర్షం నీరు

కశింకోట: మండలంలో సోమవారం సాయంత్రం వర్షం కుమ్మేసింది. ఆకాశంపై దట్టంగా మబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షం వల్ల కశింకోటలోని వీధులు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురుగు కాలువల్లో నీరుతో సహా వర్షపు నీరు రోడ్లపై ఏరులా పారింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు, గాడి వీధి, గవరపేట మధ్య వీధి తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించడానికి వర్షం నీరు తగ్గేవరకు ప్రజలు ఇబ్బంది చెందారు. వర్షం వల్ల రెండు గంటలుపైగా రాత్రి 7.15 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బంది పడ్డారు. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొంత కాలంగా సరైన వర్షాలు లేక రైతులు సతమతమవుతున్నారు. ఈ వర్షంతో రైతులు ఊరట చెందారు. ఎండిపోతున్న ఖరీఫ్ నారుమళ్లకు వర్షం ప్రాణం పోసిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.

కల్తీ మద్యం ముఠాపై చర్యలకు డిమాండ్

పరవాడ: కల్తీ మద్యంతో సంబంధం ఉన్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు డిమాండ్ చేశారు. స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేసి, బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్న ముఠా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. పరవాడలో కల్తీ మద్యం తయారు చేసిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మద్యాన్ని నియంత్రిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం.. గుడి, బడి అనే తేడా లేకుండా వద్ద మద్యం అమ్మకాలు జరుపుతోందని ఆక్షేపించారు. ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్న మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

సబ్బవరం: బంగారమ్మపాలెం సచివాలయంలో బదిలీ సిబ్బందిని సర్పంచ్ దాడి లావణ్య ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. సర్వేయర్ ఎస్ ఏఎస్‌వీ శ్రీనివాస్, డిజిటల్ అసిస్టెంట్ ఆర్ శివ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.రూప, ఏఎన్ఎం ఎస్.నారితల్లి, మహిళా పోలీస్ ఎం.విద్యాచక్రిక, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎ.ప్రభాగాయత్రిలను సన్మానించారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

అనకాపల్లి: గ్రామాల్లో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఏడాది పాలనలో ప్రతి కుటుంబం సుమారుగా రూ.లక్షలు నష్టపోయాయని సంపతిపురం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెలుగు చైతన్యకృష్ణ, పోతల శేఖర్, ఒమ్మి రమణ, యు.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సంపతిపురంలో గ్రామ పార్టీ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ చేసేవారన్నారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఏటా సంక్షేమం లబ్ధి చేకూరిందన్నారు. పార్టీ అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు ఇంటింటి కార్యక్రమం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాలు అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. గ్రామంలో చాలా కుటుంబాలకు తల్లికి వందనం పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు కుటుంబంలో ముగ్గురు, నలుగురు విద్యార్థులు ఉంటే ఒకరికే ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే వరకూ పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు భర్నికాన రాము, దాకాపు గోవింద్, కె.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అమర్చవద్దు


మండల కాంప్లెక్స్‌కూడలిలో ఆందోళన చేస్తున్న గృహ విద్యుత్ వినియోగదారులు

పరవాడ: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల రద్దు డిమాండ్‌తో సిటు ఆధ్వర్యంలో మండల కాంప్లెక్స్ కూడలిలో గృహ వినియోగదారులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను గృహాలకు అమర్చవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బిగించిన స్మార్ట్ మీటర్ల వలన అధిక విద్యుత్ బిల్లులు వస్తుండడంతో గృహ వినియోగదారులు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఇంత వరకు వచ్చిన బిల్లులను రద్దు చేయాలన్నారు.

కుటుంబానికి బాలిక అప్పగింత

పెందుర్తి: తల్లిదండ్రులపై అలిగి ఇంట్లో నుంచి బయటకు వచ్చి అనాథలా తిరుగుతున్న ఓ బాలికకు పెందుర్తి పోలీసులు రక్షణ కల్పించారు. వారం రోజుల తరువాత ఆ బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలివి.. విజయనగరం జిల్లా శృంగవరపుకోట(ఎస్.కోట) సమీపంలోని కాశీపట్నానికి చెందిన ఓ బాలిక(12) ఈ నెల 13న వేపగుంట ప్రాంతానికి వచ్చి, అనాథగా తిరుగాడుతోంది. స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో బాలికను నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. బాలికను విచారించగా తన వివరాలు చెప్పింది. ఈ క్రమంలో పోలీసులు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

కుటుంబం చెంతకు..

పెందుర్తి: తల్లిదండ్రులు మందలించారని ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన ఓ మైనర్ బాలిక(16)ను పెందుర్తి పోలీసులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెంలో నివాసం ఉంటున్న ఓ మైనర్ బాలిక తన తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఈ నెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. దీనిపై కొత్తవలసతో పాటు, పెందుర్తి పోలీస్ స్టేషన్లలో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ దేముడుబాబు ఆధ్వర్యంలోని పెందుర్తి పోలీసుల బృందం నగరంలో గాలించగా నగరంలోని రైల్వే స్టేషన్‌లో సదరు బాలిక ఆచూకీ లభించింది. సోమవారం ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

పెందుర్తి: గంజాయి నిర్మూలనలో భాగంగా గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వెస్ట్ జోన్ ఇన్‌చార్జి ఏసీపీ కాళిదాస్ తెలిపారు. పెందుర్తి సర్కిల్ పరిధిలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని పట్టుకోవడంలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తగిన రీతిలో స్పందించి గంజాయితో పాటు ఇతర అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్, ఎస్ఐలు స్వామినాయుడు, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.